సాక్షి అనంతపురం

గురువారం । 9 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.35,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35,500 పలికాయి.



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.18, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.8.50 పలికింది.

గరిష్టం/కనిష్టం

36.4°/14.9°

అనంతపురం జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం అక్కడక్కడా చలి వాతావరణం కొనసాగింది.

న్యూస్‌రీల్

ఇంటి నుంచే లింగ సమానత్వం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం సెంట్రల్: లింగ సమానత్వం ప్రతి ఇంటి నుంచి మొదలవ్వాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవ వేడుకల్లో ఇకపై పురుషులను కూడా భాగస్వాములను చేయాలన్నారు. పిల్లల పెంపకంలో అసమానతలను రూపుమాపడానికి కృషి చేయాలన్నారు. మహిళలు తమ లక్ష్యాలు, అభిరుచులకు అనుగుణంగా వృత్తిని ఎంచుకునే స్వాతంత్య్రాన్ని ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత కాలంలో టెక్నాలజీని ఉపయోగిస్తూ విభిన్నమైన వ్యాపారాలు చేస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారని తెలిపారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ మహిళా, శిశు సంక్షేమశాఖ ద్వారా మహిళలకు అందిస్తున్న పోషణ, రక్షణ, విద్య, ఆరోగ్యం తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మితో పాటు పలువురు జిల్లా అధికారిణులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, మత్స్యశాఖ డీడీ శాంతి, ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, మెప్మా పీడీ విజయలక్ష్మి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, ఐసీడీఎస్ సీడీపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలి

రాప్తాడురూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14న పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసిన ప్రతి విద్యార్థీ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకునేలా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాం సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేస్తారని పేర్కొన్నారు. వారి సూచనలు, సలహాలు, జాగ్రత్తల మేరకు విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్స్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జంబో బ్యాలెట్ పెట్టెలు వచ్చేశాయ్



జంబో బ్యాలెట్ పెట్టెలు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఈ నెల 13న జరగనుంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఓటింగ్ కోసం వినియోగించే జంబో బ్యాలెట్ పెట్టెలు బుధవారం అనంతపురానికి చేరాయి. ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానం నుంచి 49 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ క్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్ సైజ్ పెద్దగా ఉంటుంది. ఓటింగ్ కోసం మామూలు బ్యాలెట్ పెట్టెలు వినియోగించడం ద్వారా సమస్య ఉన్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ప్రధానంగా ఓటరు బ్యాలెట్ పేపర్‌ను పెట్టెలో వేసే క్రమంలో ఇబ్బంది పడాల్సి వస్తుందని గుర్తించారు. దీంతో తెలంగాణ రాష్ట్ర నల్లగొండ నుంచి ప్రత్యేకంగా రెండు వాహనాల్లో 146 జంబో బ్యాలెట్ పెట్టెలను తెప్పించారు. కలెక్టరేట్‌కు వచ్చిన వీటిని జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు తరలించారు.

మూత్రపిండాలకు ముప్పు



శరీరంలోని మలినాలను బయటకు పంపడంలో కిడ్నీలది కీలక పాత్ర. అయితే జీవనశైలిలో మార్పులతో పాటు ఆహార నియమాలు పాటించక పోవడం వల్ల కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది. కిడ్నీలు పూర్తిగా పాడైతే ప్రాణాలు పోతాయి. ప్రాథమిక దశలోనే కిడ్నీల సమస్యను గుర్తించి సరైన చికిత్స తీసుకోవాలి. మూత్రపిండాలకు ముప్పు వాటిల్లకముందే ప్రజలు మేల్కొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఇష్టారాజ్యంగా తిండి తింటామంటే కుదరదు
- ఆహారంలో స్వీయ నియంత్రణ లేకే కిడ్నీ సమస్యలు
- కిడ్నీలపై ప్రభావం చూపుతున్న బీపీ, షుగర్
- ఉమ్మడి జిల్లాలో 40 ఏళ్లకే డయాలసిస్ చేసుకుంటున్న వారెందరో..

సందర్భం
నేడు అంతర్జాతీయ కిడ్నీ పరిరక్షణ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, అనంతపురం : చిన్న వయసులోనే గుండె పోటు మరణాలు కలవర పరుస్తున్నాయి. అదే స్థాయిలో మూత్రపిండ (కిడ్నీ) వ్యాధుల భయమూ వెంటాడుతోంది. శరీరంలో అత్యంత కీలకమైన అవయవాలుగా కిడ్నీలకు ప్రాధాన్యత ఉంది. అలాంటిది కొంతమందిలో చిన్న వయసులోనే కిడ్నీలు ఫెయిలై నరకయాతన పడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇలా మూత్రపిండాలు విఫలమై చికిత్స పొందుతున్న బాధితుల సంఖ్య ఏటికేటికీ పెరుగుతోంది. 40 ఏళ్ల వయసుకే కిడ్నీలు దెబ్బతిని డయాలసిస్ చేయించుకుంటున్న వారు కూడా చాలామంది ఉన్నారు.

ఆహార నియమాలు పాటించకపోవడమే..

తిన్న ఆహారాన్ని శుద్ధి చేసి వ్యర్థాలను మలం ద్వారా పంపించడంలో కిడ్నీ ప్రాధాన్యత ఊహించలేం. అలాంటి కిడ్నీలపై భారం మోపి అతలాకుతలం చేస్తున్నారు. మటన్, ఫాస్ట్‌ఫుడ్, శీతలపానీయాలు, బటర్, చక్కెర, ఉప్పు వంటివి అధిక మోతాదులో తీసుకుని కిడ్నీల మీద లేనిపోని భారం మోపుతున్నారు. మద్యపానం, ధూమపానం కూడా కిడ్నీలకు ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి.

కొంప ముంచుతున్న పెయిన్ కిల్లర్స్

తలనొప్పి.. కాలు నొప్పి, కంటినొప్పి, పంటి నొప్పి ఇలా నొప్పి ఏదైనా పెయిన్ కిల్లర్స్ వేసుకోవడం వల్ల కిడ్నీలపై మోయలేని భారం పడుతోంది. పెయిన్‌కిల్లర్స్ తాత్కాలిక ఉపశమనం ఇవ్వొచ్చుగానీ, దీర్ఘకాలిక ప్రమాదం కొనితెస్తున్నాయి. ఆర్‌ఎంపీలు, కొంతమంది అల్లోపతి డాక్టర్లూ పెయిన్‌కిల్లర్స్ విచ్చలవిడిగా రాస్తున్నారు.

ప్రమాదానికి సంకేతాలివే...

- ఆకలి సరిగా లేకపోవడం.. తినాలని అనిపించకపోవడం
- నీళ్లు తాగినా మూత్రం సరిగా రాకపోవడం
- ఎలాంటి శారీరక శ్రమ చేయకపోయినా అలసట, నీరసం ఉండటం
- ముఖం లేదా శరీరంలో వాపు లేదా ఉబ్బరం కనిపించడం
- వికారం, వాంతులు వంటివి తరచూ ఉండటం

కిడ్నీ మార్పిడి అంత సులువు కాదు

కిడ్నీలు పనిచేయకపోతే డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. అంటే రక్తశుద్ధి. ఇది ఎన్నో ఏళ్లు కుదరదు. కిడ్నీ మార్పిడి చేయాల్సి ఉంటుంది. కిడ్నీ మార్పిడి అంటే సులువైన ప్రక్రియ కాదు. తాజాగా మన రాష్ట్రంలో దాతల కొరత విపరీతంగా ఉంది. జీవన్‌దాన్ ట్రస్ట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దాతల సంఖ్యను బట్టి ఇస్తారు. దీనికోసం ఐదారేళ్లనుంచి వేచి చూస్తున్న వారూ ఉన్నారు. అందుకే కిడ్నీని ఇబ్బంది పెట్టకుండా కాపాడుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అనంతపురం జిల్లాలో పెన్షన్ తీసుకుంటున్న కిడ్నీ బాధితులు

కేటగిరీ	సంఖ్య	పెన్షన్ మొత్తం (నెలకు)
క్రానిక్ కిడ్నీ బాధితులు	4	రూ.20,000
సీరం క్రియాటినిన్ ఎక్కువగా ఉన్నవారు	13	రూ.65,000
స్మాల్ కాంట్రాక్టెడ్ కిడ్నీ బాధితులు	11	రూ.55,000
కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ బాధితులు	82	రూ.4,10,000

శ్రీసత్యసాయి జిల్లాలో పెన్షన్ తీసుకుంటున్న కిడ్నీ బాధితులు

కేటగిరీ	సంఖ్య	పెన్షన్ మొత్తం (నెలకు)
క్రానిక్ కిడ్నీ బాధితులు	2	రూ.10,000
సీరం క్రియాటినిన్ ఎక్కువగా ఉన్నవారు	1	రూ.5,000
స్మాల్ కాంట్రాక్టెడ్ కిడ్నీ బాధితులు	3	రూ.15,000
కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ బాధితులు	87	రూ.4,35,000

నియంత్రణలో ఉంచుకోండి



రక్తపోటు, చక్కెర స్థాయిలు.. ఈ రెండూ అదుపులో ఉంచుకుంటే కిడ్నీలను కాపాడుకోవచ్చు. రోజూ వ్యాయామం చేస్తూ, మితాహారం తినడం వల్ల కిడ్నీలు ఆరోగ్యంగా పనిచేస్తాయి. శీతల పానీయాలకు వీలైనంత దూరంగా ఉండాలి. అన్నిటికీ మించి చీటికీమాటికీ నొప్పినివారిణి మాత్రలు వాడకుండా ఉంటే మంచిది. – **డాక్టర్ బదరీనాథ్, మూత్రపిండాల వైద్య నిపుణుడు**

మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి



అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల జిల్లా రైతులు మొక్కజొన్న సాగుపై అధిక ఆసక్తి చూపిస్తున్నారు. తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడి, శ్రమ తక్కువ, గిట్టుబాటు ధర లభిస్తుండడంతో జిల్లా అంతటా మొక్కజొన్న సాగు విస్తరిస్తోంది. రెండు జిల్లాలుగా విడిపోయిన తర్వాత అనంతపురం జిల్లాలో మొక్కజొన్న సాగు నామమాత్రమేనని తొలుత భావించారు. మొక్కజొన్న అధికంగా హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల తదితర శ్రీసత్యసాయి జిల్లా ప్రాంతాల్లోనే మొదటి నుంచి ఎక్కువగా సాగవుతూ వస్తోంది. అయితే ఈ రబీలో అనంతపురం జిల్లా రైతులు కూడా మొక్కజొన్నపై ఆసక్తి చూపించారు. ఈ సీజన్‌లో 4,413 హెక్టార్లు అంచనా వేయగా... 237 శాతంతో 11,823 హెక్టార్లలో సాగైనట్లు ఈ–క్రాప్ నివేదిక స్పష్టం చేస్తోంది. రబీలో ప్రధానపంటగా ఉన్న పప్పుశనగ 80,362 హెక్టార్లకు అంచనా వేయగా 77 శాతంతో 61,913 హెక్టార్లలో సాగైంది. సాధారణ సాగు కన్నా 23 శాతం తక్కువగానే పప్పుశనగ సాగైనట్లు తెలుస్తోంది. గత ఖరీఫ్‌లో నల్లరేగడి భూముల్లో ఎక్కువగా పత్తి, మిరప సాగవడంతో రబీ పంట తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు. మరో ప్రధానపంట వేరుశనగ సాధారణ సాగు 18,909 హెక్టార్లు కాగా 101 శాతంతో 19,087 హెక్టార్లలో సాగైంది. భారీ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా నీటి వనరులు పెరగడంతో వరితో పాటు వేరుశనగ, మొక్కజొన్న, పెసర, మినుము, ఆముదం, పొద్దుతిరుగుడు, తెల్లకుసుమ లాంటి పంటల సాగు బాగా పెరిగింది. దీంతో పంటల సరళిలో మార్పు వచ్చింది. రెండేళ్ల క్రితం వరకు మినుము పంటకు జిల్లాలో స్థానం లేదు. ఇటీవల మినుము సాగుకు కొందరు రైతులు ముందుకు వచ్చారు.

రంగుల కేళి.. హోలీ



అనంతపురంలో చిన్నారులపైకి రంగులు జల్లుతున్న దృశ్యం

అనంతపురం కల్చరల్ : సప్త వర్ణాల శోభితమైన పండుగ.. వసంత శోభతో పరిఢవిల్లే నూతన వేడుక.. రంగుల కేళి.. హోలీ. జిల్లా అంతటా సంతోషాల నడుమ సాగింది. సుఖం, దుఃఖం, సంతోషం, విచారం అన్నీ కలిసిన రంగులే ఈ హోలీ. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్కచోటకు చేర్చింది. చిన్న, పెద్ద, మహిళలు, పురుషులు తేడా లేకుండా అందరూ అనురాగం, ఆప్యాయతలతో కలిసిన పన్నీటి రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించారు. ఈసారి మంగళవారం, బుధవారం రెండురోజులూ పండుగను జరుపుకొన్నారు. అనంతపురంలోని పాతూరు, కమలానగర్ జైన మందిరాల్లో హోలీ పూజలు నిర్వహించారు.



హోలీ సంబరాల్లో నగరవాసులు

శేషవాహనంపై ప్రహ్లాద వరదుడు



శేషవాహనంపై లక్ష్మీ నారసింహుడు

కదిరి: ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు కమనీయంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు శేష వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు శ్రీవారిని బంగారు, వజ్ర, వైఢూర్య, మరకత, మాణిక్య, పట్టు పీతాంబరాలతో విశేషంగా అలంకరించారు. రాత్రి 9 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శేషవాహనంపై కొలువుదీర్చారు. ప్రతి ఉత్సవంలోనూ ఒక్కరే దర్శనమిచ్చే స్వామివారు... శేషవాహనంపై మాత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా కనిపించడంతో భక్తులు స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని తన్మయత్వం చెందారు. లక్ష్మీ నారసింహునికి సేవ చేయడానికి సాక్షాత్తు ఆదిశేషుడే వాహనంగా విచ్చేశారని అర్చక పండితులు వివరించారు. అంతకుముందు యాగశాల ప్రవేశం, నిత్య హోమాలు నిర్వహించి స్వామి వారిని సుగంధ ద్రవ్యాలతో అలంకరించారు. ఆచార్య రుత్వికులను ఆలయ మర్యాదలతో అర్చకులు ఆహ్వానించారు. శేష వాహన ఉభయదారులుగా యాదాలం శ్రీనివాసులు, బాలాజీ కుటుంబ సభ్యులు వ్యవహారించారని ఆలయ ఈఓ గురుప్రసాద్ తెలిపారు.

నేడు సూర్య, చంద్ర ప్రభ

లోకంలో పుట్టడం, జీవించడం, మరణించడం అనే మూడు ప్రక్రియలు కాలాధీనాలు. ఆ కాల స్వరూపుడిని తానేనంటూ భక్తులకు చాటి చెప్పేందుకు ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు గురువారం పగలు సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

బైక్ అదుపుతప్పి ఏఆర్ కానిస్టేబుల్ మృతి



మల్లికార్జున నాయుడు (ఫైల్)

తనకల్లు: బైక్ అదుపుతప్పి చెట్టును ఢీ కొన్న ఘటనలో ఏఆర్ కానిస్టేబుల్ మృత్యువాత పడ్డాడు. ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం తోడేళ్లగడ్డపల్లికి చెందిన మల్లికార్జుననాయుడు (35) ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొన్నిరోజులుగా కదిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల బందోబస్తు విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం స్వగ్రామానికి వచ్చాడు. నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి కావాల్సిన సామాగ్రిని కొక్కంటిక్రాస్‌లోని ఓ దుకాణంలో కొనుగోలు చేసి గ్రామానికి పంపించాడు. అనంతరం తిరిగి విధుల నిర్వహణ కోసం తన ద్విచక్ర వాహనంలో కదిరికి బయలుదేరాడు. అయితే సాయిబాబా గుడి దాటిన తర్వాత అతను ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జున నాయుడు అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని స్థానిక 30 పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లికార్జున నాయుడు మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుద్ధం శరణం గచ్ఛామి

ప్రశాంతి నిలయం: హోలీ పర్వదినం సందర్భంగా బుధవారం ప్రశాంతి నిలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన వేలాది మంది భక్తులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో వేడుకలు ప్రారంభంకాగా, బిహార్ సత్యసాయి బాలవికాస్ చిన్నారుల 'భగవాన్ బుద్ధ' పేరుతో నాటిక ప్రదర్శించారు. బుద్ధుని బాల్యం, జీవిత ఘట్టాలు, బోధనలను వివరిస్తూ తమ అద్భుత నటనతో ఆకట్టుకున్నారు. బుద్ధం శరణం గచ్ఛామి గురించి వివరించారు. అనంతరం నిర్వహించిన సంగీత కచేరీ ఆహూతులను అలరించింది.

సాధికారత దిశగా మహిళల అడుగులు

- మహిళా దినోత్సవంలో మంత్రి ఉషశ్రీ చరణ్, విప్ కాపు రామచంద్రారెడ్డి



కళ్యాణదుర్గంలో మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి కేకు కట్ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



రాయదుర్గంలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం/రాయదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో మహిళలు సాధికారత వైపు అడుగులు వేస్తున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంత్రి ఉషశ్రీచరణ్, రాయదుర్గంలోని తన కార్యాలయంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మహిళలనుద్దేశించి మాట్లాడారు. తాము ఎంచుకున్న రంగాల్లో మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు కదిలితేనే విజయాలు సాధించగలరన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా ఏపీ సీఎం జగన్ మహిళలకు సమానత్వం, సాధికారత, స్వయం శక్తి కోసం పాటుపడుతున్నారన్నారు. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, సంపూర్ణ పోషణ తదితర సంక్షేమ పథకాలతో పాటు కడుపులోని శిశువు నుంచి పండు ముదుసలి వరకు అందరికీ అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ సర్కారు మాత్రమేనని కొనియాడారు. మహిళల రక్షణ, భద్రత కోసం దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కళ్యాణదుర్గం కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, ఎంపీపీ మారుతమ్మ, పట్టణ సచివాలయాల కన్వీనర్ అర్చన, మెప్మా అధ్యక్షురాలు హేమ, దివ్య, మహిళలు పాల్గొన్నారు. రాయదుర్గం వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సోదరుడితో పాటు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దారెడ్డితోనే తాడిపత్రిలో శాంతి


ఎమ్మెల్యే పెద్దారెడ్డితో మాజీ ఎమ్మెల్యే విశ్వ

పెద్దపప్పూరు: ఫ్యాక్షన్ ప్రభావితమైన తాడిపత్రి నియోజకవర్గంలో శాంతి కుసుమాలు విరబూస్తున్నాయంటే అందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన చర్యలేనని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లి వద్ద కొనసాగుతున్న పెద్దారెడ్డి పాదయాత్రకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు నామనాంకపల్లి వరకూ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ... రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలవుతున్నాయన్నారు. గతానికంటే భిన్నంగా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు.

అండర్‌-19 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా అండర్‌–19 క్రికెట్ జట్టును బుధవారం అనంత క్రీడాగ్రామంలోని క్రికెట్ నెట్స్‌లో ఎంపిక చేశారు. ఎంపిక కమిటీ సభ్యులుగా షాషావలి, నరేష్, కమలాకర్ నాయుడు వ్యవహరించారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 87 మంది క్రీడాకారులు హాజరు కాగా, వీరిలో ప్రతిభ కనబరిచిన 42 మందిని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మ్యాచ్‌లు నిర్వహించి తుది జట్టును ఎంపిక చేయనున్నారు.

వైఎస్ జగన్‌తోనే మహిళా సాధికారత

- మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచిన సీఎం
- ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ
- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం


వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, తదితరులు

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవం మరింత పెరిగిందని, వైఎస్ జగన్‌తోనే మహిళా సాధికారత సాధ్యమైందని ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలసి వారు కేక్ కట్ చేసి మాట్లాడారు. ఇటీవల పార్టీ ప్రకటించిన 18 ఎమ్మెల్సీ పదవుల్లో 15 బీసీలకే కేటాయించి సామాజిక న్యాయానికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేశారని కొనియాడారు. కేబినెట్, ఎంపీ, ఎమ్మెల్యే, నామినేటెడ్ పదవుల్లోనూ మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. మహిళలను చిన్నచూపు చూడకూడదని, వారు ఉన్నతంగా జీవించేందుకు విద్య అవసరమని చాటిచెప్పిన మహనీయుడు జ్యోతిరావ్ పూలే అడుగుజాడల్లో జగన్ సర్కార్ నడుస్తోందన్నారు. రాజకీయంగా మహిళలకు 51 శాతం చట్టబద్ధత కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల మాట్లాడుతూ.. మహిళలపై అఘాయిత్యాలు చోటు చేసుకోకుండా ప్రత్యేకంగా దిశ చట్టాన్ని సీఎం వైఎస్ జగన్ తీసుకువచ్చి అండగా నిలిచారన్నారు. ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఎవరూ చేయని విధంగా మహిళా సంక్షేమం, రాజకీయ ఎదుగులకు బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఔనత్యాన్ని కొనియాడారు. పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. సంక్షేమానికి సంబంధించిన ప్రతి పథకం లబ్ధి మహిళలకే వర్తింపజేసేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలపై హర్షం వ్యక్తం చేశారు. తర్వాత మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మార్గం సుగమమైందన్నారు. కార్యక్రమంలో అనంతపురం నగర డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, నాటక అకాడమి చైర్‌పర్సన్ హరిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కొండమ్మ, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునీరాబేగం, కార్పొరేటర్లు జయలలిత, సుజాత, లక్ష్మీదేవి, ఎం.రాజేశ్వరి, నాయకురాళ్లు రాధాయాదవ్, సుహాసిని, భారతి, దేవి, గౌరి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహిళా ప్రజాప్రతినిధులతో పాటు వివిధ పదవుల్లో కొనసాగుతున్న పలువురిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఘనంగా సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, నాటక మండలి చైర్‌పర్సన్ హరిత, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, తదితరులున్నారు.

మహిళలకు సముచిత స్థానం : మంజుల

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయడం వల్లనే అన్ని రంగాల్లో మహిళలకు సముచిత స్థానం దక్కుతోందని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. స్థానిక జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇబ్బందులు ఎదురైనప్పుడు యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని మాట్లాడుతూ.. ఆర్టీసీ రీజియన్ పరిధిలో 160 మంది మహిళా ఉద్యోగులు వివిధ హోదాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. వీరి పనితీరు వల్లనే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతున్నామన్నారు. ఆర్టీసీలో మహిళా ఉద్యోగుల సంక్షేమానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని భరోసానిచ్చారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన మహిళా కండక్టర్లు దేవి(తాడిపత్రి), గౌరి(తాడిపత్రి), భాగ్యవతి(ఉరవకొండ), శ్రీవాణి(అనంతపురం), షంషాద్(గుంతకల్లు), సరళ(రాయదుర్గం), అనిత(సీనియర్ అసిస్టెంట్, ఆర్ఎం ఆఫీసు), నందిని(తాడిపత్రి)ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెల్త్ సర్వీసెస్ జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణవేణి, అడ్వకేట్ పద్మ, ఏఓ లక్ష్మీదేవి, డిప్యూటీ చీఫ్ మెకానిక్ మోహన్‌కుమార్, డిపో మేనేజర్ నాగభూపాల్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో...


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సతీమణి సుమ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప, ఆయన సతీమణి సుమ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఉమెన్స్ డాక్టర్స్ వింగ్ సౌజన్యంతో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయించి, మహిళా హోంగార్డులు, మహిళా పోలీసు ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మహిళా వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు శివరాముడు, చక్రవర్తి, ఇందిర, పోలీసు ఆస్పత్రి వైద్యులు వెంకటేశ్వర ప్రసాద్, కాత్యాయిని, శ్యామలాశ్రీదేవి, బీజే ప్రసాదరెడ్డి, దివ్యశ్రీ, స్వాంతన, తస్వీన్, అపర్ణ, రాచెల్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి


మృతుడు ఇర్ఫాన్

తాడిపత్రి: విద్యుత్ షాక్‌కు గురై వలస కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం మునగలపాడు నివాసి ఇర్ఫాన్ (24) కొన్నేళ్లుగా తాడిపత్రి పరిధిలోని గన్నేవారిపల్లి కాలనీ ఉంటూ గ్రానైట్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. వారానికి ఒకసారి స్వగ్రామానికి వెళ్లి వచ్చేవాడు. బుధవారం తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ కట్టడంలో గ్రానైట్ ఫ్లోరింగ్ పనుల్లో నిమగ్నమయ్యాడు. ఆ సమయంలో ఫ్లోరింగ్ మిషన్‌కు విద్యుత్ ప్రసారం కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

గుంతకల్లులో 'బలగం' సందడి


థియేటర్‌లో ఎమ్మెల్యే వైవీఆర్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డితో బలగం చిత్ర బృందం

గుంతకల్లు: బలగం చిత్ర బృందం బుధవారం గుంతకల్లులో సందడి చేసింది. చిత్రాన్ని ప్రదర్శిస్తున్న థియేటర్‌కు హీరో ప్రియదర్శి, హీరోయిన్ కావ్య, నటుడు రచ్చరవి, దర్శకుడు వేణు, నిర్మాతలు హర్షిత్‌రెడ్డి, హన్షిత తదితరులు చేరుకున్నారు. బృందంతో కలసి చిత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కుటుంబ సభ్యులు వీక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఎమ్మెల్యే వైవీఆర్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ బలగం సినిమా బాగుందని, బంధాలు.. బంధుత్వాలను చాలా చక్కగా చూపించారని కొనియాడారు. కుటుంబ కథాచిత్రాన్ని ప్రతి ఒక్కరూ చూడవచ్చునన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళలే కీలకం



మాట్లాడుతున్న కేరళ మాజీ మంత్రి పీకే శ్రీమతి, సదస్సుకు హాజరైన మహిళలు

- మహిళా సదస్సులో కేరళ మాజీ మంత్రి పీకే శ్రీమతి

అనంతపురం కల్చరల్: సమాజాభివృద్ధిలో మహిళలే కీలకమని, వారిని గౌరవించడం అందరూ కర్తవ్యంగా భావించాలని కేరళకు చెందిన మాజీ మంత్రి పీకే శ్రీమతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐద్వా, దాని అనుబంధసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అనంతపురంలోని టీటీడీ కల్యాణమంటపంలో మహిళా సదస్సు నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పీకే శ్రీమతి హాజరై, మాట్లాడారు. అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నప్పటికీ మహిళల పట్ల వివక్ష కొనసాగుతుండడం బాధాకరమన్నారు. మహిళలతో పాటూ దళితులు, మైనార్టీలకు కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రక్షణ కల్పించలేకపోతోందన్నారు. సమానత్వం కోసం అన్ని చోట్లా మహిళలు సాగిస్తున్న పోరాటాల్లో పురుషుల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. అనంతరం శ్రీమతిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో నాట్యాచార్యులు సంధ్యామూర్తి, ఐద్వా అధ్యక్షకార్యదర్శులు శ్యామలమ్మ, రాజేశ్వరి, డాక్టర్ ప్రసూన, డాక్టర్ యండ్లూరి ప్రభాకర్, యూటీఎఫ్ సీనియర్ నాయకురాలు ఉషారాణి, దేవేంద్రమ్మ, యమున, సరళ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మౌనపోరాటం

- భర్త ఇంటి ఎదుట ఆందోళన
- న్యాయవాది కుటుంబం వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు


న్యాయవాది శంకరయ్య ఇంటి ఎదుట బైఠాయించిన కోడలు అమృత

కళ్యాణదుర్గం: అత్తారింటి వేధింపులు తాళలేక అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున భర్త ఇంటి ఎదుట ఓ వివాహిత ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయాలంటూ పోలీసులను వేడుకుంది. బాధితురాలు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన అరినేని అమృతను కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన న్యాయవాది శంకరయ్య కుమారుడు పృథ్వీరాజ్‌కు ఇచ్చి ఐదేళ్ల క్రితం వివాహం జరిపించారు. పెళ్లైన కొత్తలో రెండు నెలల పాటు అత్తారింట్లో ఉంచుకున్నారు. అనంతరం కోల్‌కత్తా సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి భర్త వెళ్లాడు. ఆ సమయంలో అమృతను పుట్టింటికి పంపారు. అప్పటి నుంచి ఆమెను చేరదీయలేదు. తానుగా అత్తారింటికి వచ్చినా.. ఇంట్లోకి రానివ్వకుండా బయటే ఉంచి సూటిపోటి మాటలతో వేధించి వెనక్కు పంపేవారు. ఈ విషయంగా పలుమార్లు కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో ఇరు కుటుంబాల మధ్య పంచాయితీలు జరిగాయి. పెద్దల సమక్షంలో రాజీ అయినా.. అమృతను ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుకునే వారు. ఈ క్రమంలో తన బంధువులతో కలసి బుధవారం అత్తారింటి ఎదుట నిరసనకు దిగింది. దీంతో ఆందోళనకారులతో శంకరయ్య వాగ్వాదానికి దిగాడు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ నాగమధు, సిబ్బంది అక్కడకు చేరుకుని ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇరు కుటుంబాల అభిప్రాయాలను సీఐ తేజమూర్తి సేకరించుకుని న్యాయం చేస్తామని అమృతకు హామీ ఇవ్వడంతో వివాదం ముగిసింది.

నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, జిల్లా అధికారి డాక్టర్ నారాయణస్వామి ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా స్థాయి అధికారులతో బుధవారం వారు వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు ఉన్న వారందరికీ ఈ నెల 14న అల్బెండెజోల్ మాత్రలను ఉచితంగా అందజేయాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ నెల 10 నుంచి గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 6.60 లక్షల మంది పిల్లలను గుర్తించడం జరిగిందని, వీరందరికీ నులిపురుగుల నివారణ గుళికలను అందజేయాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను గెలిపించండి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఆలూరి సాంబశివారెడ్డి, పైలా నరసింహయ్య తదితరులు

- ఎంపీ రంగయ్య

బుక్కరాయసముద్రం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు ఎంపీ రంగయ్య పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలసి బుధవారం ఆయన రేకులకుంటలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటోందన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, ఎంపీపీ సునీత, వైస్ ఎంపీపీ జయలక్ష్మి, సర్పంచ్‌లు నరసమ్మ, పార్వతి, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాకే రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, గువ్వల రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

హోలీ సంబరాల్లో అపశ్రుతి

గుంతకల్లు: హోలీ సంబరాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. గుంతకల్లుకు చెందిన సీనియర్ అసిస్టెంట్ లోకోపైలట్ అఖింత్‌ఖేర్ (28) హంద్రీనీవా కెనాల్ గల్లంతయ్యాడు. బుధవారం ఉదయం తన ముగ్గురు స్నేహితులతో కలసి హోలీ సంబరాల్లో పాల్గొన్న అఖింత్‌ఖేర్ .. అనంతరం పడమటి గుంతకల్లు రైల్వేస్టేషన్ సమీపంలోని హంద్రీనీవా కాలవలో స్నానం చేసేందుకు వెళ్లారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు కాలు జారి అఖింత్‌ఖేర్ గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, గాలింపు చర్యలు చేపట్టారు. రంగంలో అగ్నిమాపక సిబ్బంది దిగింది. రాత్రి వరకూ గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు.

ఎస్కేయూ అధ్యాపకురాలికి ఫార్మా అన్వేషణ్ అవార్డు


డాక్టర్ వరలక్ష్మీదేవి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాల సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ కె.వరలక్ష్మీదేవి... ఫార్మా అన్వేషణ్ అవార్డును అందుకున్నారు. ఆల్ ఇండియా ఫార్మా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఫోరమ్ నిర్వహించిన వేడుకల్లో ఈ అవార్డును ఆమె అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఫార్మసీ అధ్యాపకులకు కొత్త ఆవిష్కరణలకు సంబంధించిన అంశాలపై పోటీ నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులతో నిర్వాహకులు సత్కరించారు. అవార్డు దక్కించుకున్న వరలక్ష్మీదేవిని ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, రెక్టార్ ఎ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్ అభినందించారు.

ఘర్షణ కేసులో ఐదుగురిపై కేసు నమోదు

రాయదుర్గం రూరల్: హోలీ సందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణలో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాయదుర్గం అర్బన్ ఎస్‌ఐ సుమన్ తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం మల్లాపురం తండాలో మంగళవారం రాత్రి సురేష్ నాయక్‌పై స్థానికులు లక్ష్మ్యానాయక్, నాగేంద్రనాయక్, కృష్ణానాయక్, ఈశ్వర నాయక్, బాలకృష్ణానాయక్, విజయానాయక్ మూకుమ్మడిగా దాడి చేశారు. ఘటనలో సురేష్ తలకు, కాళ్లుచేతులకు రక్త గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి సోదరుడు సేవ్యానాయక్ ఫిర్యాదు మేరకు దాడికి బాధ్యులైన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

యాడికి: అదనపు కట్నం వేధింపులపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. యాడికి మండలంలోని కోనుప్పలపాడు గ్రామానికి చెందిన అశ్వినికి ఐదు నెలల క్రితం నిట్టూరు నివాసి వెంకటప్రసాద్‌తో వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నకానుకలను అశ్విని తల్లిదండ్రులు సమర్పించారు. పెళ్లైన రెండు నెలల వరకూ సజావుగా సాగిన వీరి కాపురం.. అనంతరం భర్తతో పాటు అత్త అదనపు కట్నం కోసం వేధించసాగారు. ఈ విషయంగా పెద్ద మనుషుల పంచాయితీలు నిర్వహించినా ఫలితం లేకపోయింది. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అతని తల్లిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేత్రపర్వంగా ప్రభ ఉత్సవం


ముస్తాబు చేసిన కాటి కోటేశ్వరుని ప్రభ

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం సమీపంలో వెలసిన కాటికోటేశ్వర బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. బుధవారం రాత్రి లంకాదహనం కార్యక్రమాన్ని పండు వెన్నెల్లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. రాత్రి స్వామి ప్రభను ఊరేగించారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సందడి చేశారు. ఈ వేడుకను చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. సంజీవపురం, లింగారెడ్డిపల్లి, యర్రాయపల్లి, ముష్టూరు, వెంకటగారిపల్లి, అనంతసాగరం గ్రామాలకు చెందిన పలువురు భక్తులు క్షేత్రానికి ప్రత్యేకంగా ఎద్దుల బండ్లను అలంకరించుకుని వచ్చారు. క్షేత్రంలోని మహంకాళీమాత ఆలయంలో గోపూజను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ సుధాకరరెడ్డి, ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి, సర్పంచులు చెడిపోతుల గోపాల్, కమతం వరలక్ష్మి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రేణుక, సీపీఐ నాయకులు కమతం కాటమయ్య, మాజీ ఎంపీపీ గుర్రం వనజ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం నాయకులు కమతం ఈశ్వరయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బడుగుల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

రామగిరి: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఆ పార్టీ సీనియర్ నేత తోపుదుర్తి చందు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పేరూరు, పెద్దకొండాపురం, ఎంసిపల్లి, గరిమేకలపల్లిల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ రమేష్, నాయకులు నరసింహారెడ్డి, వెంకట రెడ్డి, నర్సిరెడ్డి, రాజేష్, జనార్ధన్, సిద్ధన్న, కురుబ అంజి తదితరులు పాల్గొన్నారు.

18న హుండీ కానుకల లెక్కింపు

ఆత్మకూరు: పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 18న హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఈఓ అక్కిరెడ్డి బుధవారం తెలియజేశారు. గ్రామస్తులతో పాటు భక్తులు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 20న ఆలయ ప్రాంగణంలో కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కు కోసం వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చిన వివరించారు.

సందడిగా వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రాప్తాడురూరల్: అనంతపురం నగరంలోని నారాయణ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు డ్యాన్సులతో అదరగొట్టారు. బుధవారం స్థానిక బాలాజీ ఫంక్షన్ హాలులో కళాశాల (డేస్కాలర్స్) వార్షికోత్సవ వేడుకలు ప్రిన్సిపల్ హిమబిందు, ఏజీఎం కాశీ ప్రేమ్‌నాథ్ అధ్యక్షతన జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ పాటలకు చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాశాల టాపర్లకు కో కోర్ డీన్ బద్రీనాథ్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చే వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థినీ ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీజీఎం వెంకటరామిరెడ్డి, డీన్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'కోనసీమ అల్లర్ల కేసు ఎత్తివేస్తే సహించం'

అనంతపురం: కోనసీమకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును వ్యతిరేకిస్తూ విధ్వంసకు పాల్పడిని అల్లరిమూకలపై పెట్టిన కేసులు ఎత్తివేస్తే సహించేది లేదని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. అనంతపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. కేసులు ఎత్తివేస్తామని మంత్రి ప్రకటించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామాంజినేయులు, ధార శంకర్, సంజీవరాయుడు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందిస్తాం



భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా భగవద్గీతను ప్రతి ఇంటి ముంగిటకు తీసుకువస్తున్నట్లు ఇందూ ధర్మ వేదిక అధ్యక్షులు మల్లికార్జున అన్నారు. బుధవారం కల్యాణదుర్గం రోడ్డులో పలు చోట్ల ఇందూ ధర్మ ప్రచారం జరిగింది. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత సిద్ధాంతాన్ని గురించి వివరించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ వైశిష్ట్యాన్ని అందరూ తెలుసుకోవడం ద్వారా సమాజంలో నిస్వార్థాన్ని చూడగలమన్నారు. దైవభక్తి ఉత్తమ జీవితానికి మార్గంగా ఉంటుందని అందరూ గీతాప్రవచనం వినాలని కోరారు. సుధాకర్, పద్మావతి, అనురాధ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, డీజీఎం అనురాధ

రాప్తాడురూరల్: మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో 'మహిళా సాధికారత-సమాజ సంస్కృతి' అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గాయత్రి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ మహిళలు అని రంగాల్లో రాణించాలన్నారు.ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా అన్ని రంగాల్లో పనిచేయాలన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయినులను సన్మానించారు. కార్యక్రమంలో విప్లవ రచయిత సంఘం శశికళ, జువాలజీ అధ్యాపకులు ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను బుధవారం అనంతపురం నగరంలోని వివిధ విద్యా సంస్థల్లో ఘనంగా జరుపుకొన్నారు. ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ దత్తత తీసుకున్న బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లిలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు.

మోక్షిత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో...

స్థానిక విన్సెంట్ ఫెర్రర్ నగర్‌లో ఉన్న మోక్షిత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల ఔన్నత్యాన్ని వివరించారు. జ్యోతిబా పూలే వంటి నారీమణుల పోరాట పటిమను తెలియజేశారు. కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ మగువ మానవ సమాజ మేలిమి ముత్యం అన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక దిశ పోలీసు స్టేషన్లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని డీఎస్పీ ఆర్ల శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మిని సత్కరించారు. స్వీట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలమన్నారు. కార్యక్రమంలో దిశ కౌన్సెలింగ్ టీం మెంబర్ శ్రీకళ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సహకార కేంద్ర బ్యాంకులో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక సహకార కేంద్ర బ్యాంకులో ఘనంగా నిర్వహించారు. బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి మహిళా సిబ్బందికి శుభకాంక్షలు తెలియజేశారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీజీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పురుషులతో సమానంగా రాణించాలి

అనంతపురం టౌన్: అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ డీఐజీ మాధవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రుద్రంపేట సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో ప్రభుత్వాలు మహిళలకు సమాన హక్కులను కల్పించాయన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి, సబ్ రిజిస్ట్రార్లు శిరీషా, సీనియర్ అసిస్టెంట్లు హేమలత, సుచరిత, రాధ, నవనీత, సమత, జూనియర్ అసిస్టెంట్ పావని, తన్మయి, కవిత తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీలో..

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో బుధవారం ఘనంగా మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీన్ ఇంచార్జి ప్రొఫెసర్ జి. రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సాధికారతతోనే దేశ పురోగతి సాధ్యమన్నారు. మహిళా ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పొలిటికల్ సైన్సెస్ విద్యార్థులు నిర్వహించిన నాటిక ప్రదర్శనకు ప్రశంసలు దక్కాయి. ఎన్ఎస్ఎస్ పీఓ ప్రణతి పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీఓ హోంలో..

ఏపీ ఎన్‌జీఓ హోంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ లలితకుమారి, జిల్లా ట్రెజరీ అధికారి సరళా కుమారి, జిల్లా నోడల్ అధికారి సుజాత, న్యాయవాది శైలజ, జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ అనుపమ జేమ్స్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ కృష్ణవేణి, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల, రాష్ట్ర ఎన్‌జీఓ ఉపాధ్యక్షుడు జే. మాధవ, జిల్లా ఎన్‌జీఓ అధ్యక్షుడు బి. చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి. చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు..

అనంతపురం కల్చరల్: స్థానిక లక్ష్మీనగర్‌లోని రెయిన్‌బో అనాథాశ్రమంలో సద్దాంబాషా ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ సదస్సులో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి ఆత్మీయ అతిథిగా విచ్చేసి అనాథ బాలికలను ఆదరిస్తున్న నిర్వాహకులను అభినందించారు. అలాగే రాజీవ్‌కాలనీ పంచాయితీ సర్పంచ్ ఆషియాబీ, సుదర్శన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

- ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు తాడిమర్రి లాల్‌బాషా నేతృత్వంలో మహిళాదినోత్సవ వేడుకలు జరిగాయి. సంస్థ గౌరవాధ్యక్షులు ఆదిలక్ష్మి, శారదా తదితరులను సత్కరించారు.
- పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో మహిళా కళాకారులను సన్మానించారు. నగరంలోని ఆ సంఘం కార్యాయలయంలో జరిగిన కార్యక్రమంలో గాయనులు శ్రీదేవి, విజయక్ష్మి, సుధారాణి, జ్యోతి, శకుంతలాదేవి, రాజేశ్వరి, అమృతబిందు తదితరులను సత్కరించారు. సంస్థ ప్రతినిధులు సురేష్‌బాబు, ఆదినారాయణ, సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో..

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లాలోని 719 గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. బొమ్మన హాళ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ మాట్లాడారు. దైనందిన జీవితాల్లో రాణించిన వివిధ మహిళలను సంస్థ ప్రత్యేకంగా అభినందిస్తోందన్నారు.

- ఆర్డీటీ అంధ ఉద్యోగుల ఆధ్వర్యంలో తాహెరా ట్రస్ట్ సౌజన్యంతో స్థానిక ఆర్డీటీ ప్రత్యేక అవసరాల పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అంధ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రబాబు, కార్యదర్శి జలంధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో రవికాంత్ రమణ, జిల్లా అంధ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనాయుడు, షాజియాబి, మీనాక్షమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన వన్ కే రన్ కార్యక్రమాన్ని ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు ప్రారంభించారు. అంతర్జాతీయ, జాతీయ, సౌత్‌జోన్ పోటీల్లో రాణించిన క్రీడాకారిణులు రాజేశ్వరి, పుష్పావతి, త్రివేణి, ముస్కాన్, గంగోత్రి, పల్లవి, లావణ్యలను ఘనంగా సన్మానించారు. వీరితో పాటు యోగ శిక్షకురాలు కృష్ణవేణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత సాధించాలి

కనగానపల్లి: మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలని ఆర్డీటీ సంస్థ రీజనల్ డైరక్టర్ ప్రమీలా పేర్కొన్నారు. వేపకుంట గ్రామంలో బుధవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు, ఆర్డీటీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఏటీఎల్ రఘురామ్, సీఓ సురేష్, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పార్వతమ్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి సమానత్వాన్ని చాటిచూపారన్నారు. ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, సిబ్బంది ఉన్నారు.



క్రీడాకారిణులను సత్కరించిన దృశ్యం



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి



సెంట్రల్ వర్సిటీలో సాంస్కృతిక కార్యక్రమాలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్‌బీఎన్ విద్యార్థులు

సీఎంకు అండగా నిలుద్దాం

రాప్తాడురూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలుద్దామని ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బుధవారం అనంతపురం రూరల్ కక్కలపల్లికాలనీ పంచాయతీలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో ముఖ్యమంత్రి సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలోనూ ఆయనకు ఎవరూ సాటి లేరన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రికి అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేసి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మీ, ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సతీమణి హరిత, నాయకులు ధనుంజయయాదవ్, మఠం శ్యాంసుదర్, బండి పవన్ కుమార్, మండల యూత్ కన్వీనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మంగమ్మ, పైలా నరసింహయ్య తదితరులు

వైభవంగా మలహోబిలేశుని పరుష

ఆత్మకూరు: పంపనూరు కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పరుష వైభవంగా జరిగింది. పంపనూరు, పంపనూరు తండా, వై.కొత్తపల్లి, ఆత్మకూరుకు చెందిన భక్తులు పన్నేరపు బండ్లను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రంగయాదవ్ ప్రత్యేక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి



పరుషలో భక్తుల సందడి

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

శింగనమల: నాయనవారిపల్లిలో కొల్లాగయ్య, గంపమల్లయ్య ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ప్రారంభించారు. చక్రాయిపేటకు చెందిన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎద్దుల రవీంద్రానాథ్‌రెడ్డి వృషభాలు ప్రథమ బహుమతి గెలుపొందగా, ఆలూరు సాంబశివారెడ్డి రూ.60,116 అందజేశారు. కడప జిల్లా పోతురెడ్డిపల్లి ప్రసాద్‌రెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో నిలవగా వైఎస్సార్‌సీపీ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి రూ.50,116 అందజేశారు. మూడో బహుమతి ఊబిచెర్లకు చెందిన గోవిందు వృషభాలు గెలుపొందగా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేత చామలూరు రాజగోపాల్ రూ.40,116 అందించారు.

దేవదానం సేవలు చిరస్మరణీయం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసు అధికారిగా దేవదానం చేసిన సేవలు చిరస్మరణీయని పలువురు పోలీసు అధికారులు కొనియాడారు. విశ్రాంత పోలీసు అధికారి దేవదానం 98వ పుట్టిన రోజు వేడుకలను స్థానిక కృపానందనగర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విశ్రాంత పోలీసు ఉద్యోగుల అసోషియేషన్ సభ్యులతో పాటు పలువురు జిల్లా పోలీసు అధికారులు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు పోలీసులు మాట్లాడుతూ 1948 జనవరిలో దేవదానం పోలీస్ శాఖలో ఎస్ఐగా చేరారని తెలిపారు. 1983 ఏప్రిల్ 30న ఇన్‌స్పెక్టర్‌గా పదవీ విరమణ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆయన 98 సంవత్సరాల్లోకి అడుగిడినప్పటికీ చాలా ఆరోగ్యంగా ఉన్నారన్నారు. దేవదానంను జిల్లా ఎస్పీ గుర్తించి ఆయన పుట్టిన రోజున సిబ్బంది వెళ్లి పలకరించి శుభాకాంక్షలు తెలియజేసి, సత్కరించాలని సూచించారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, సీఐలు రవిశంకర్ రెడ్డి, శివరాముడు, కత్తి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.



దేవదానంకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పోలీసులు

పార్టీ బలోపేతానికి కృషి



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి స్వీట్ తినిపిస్తున్న రిలాక్స్ నాగరాజు

అనంతపురం క్రైం: తనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ అనుబంధ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో కలసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లుగా పార్టీ అభివృద్ధికి కృషి చేశానని, తనపై సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నమ్మకంతో అవకాశమిచ్చారన్నారు. నాలుగు జిల్లాల ప్రజాప్రతినిధుల సూచనలతో పాటల ద్వారా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, కొర్రపాడు హుస్సేన్ పీరా, కార్పొరేటర్లు చంద్రమోహన్ రెడ్డి, ఇస్సాక్, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, నాయకులు నక్క చంద్ర, అనిల్‌కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీ విజేత శ్రీహ



చెస్ టోర్నీలో పతకాలు సాధించిన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మొదటి రోడ్డులో ఉన్న చెస్ బెనిఫిట్స్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. టోర్నీ ఛాంపియన్‌షిప్‌ను శ్రీహ దక్కించుకుంది. ద్వితీయ స్థానంలో సుకృత, తృతీయ స్థానంలో అస్మితఅనిమి, నాల్గవ స్థానంలో భారతి నిలిచారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, ఉదయ్‌కుమార్ నాయుడు, నగర ప్రముఖులు శిరీష, తులశమ్మ, టోర్నీ ఆర్బిటర్ మల్లికార్జున చేతుల మీదుగా బుధవారం వారికి బహుమతులను అందించారు. విజేతలు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి మహిళా ఛాంపియన్‌షిప్‌లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

'రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం'

అనంతపురం: రాష్ట్రంలో అవినీతి తప్ప అభివృద్ధి శూన్యమని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ పేర్కొన్నారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. విశాఖ వేదికగా జరిగిన పెట్టుబడుల సదస్సు అంతా బూటకమని ఎద్దేవా చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జీఓలు జారీ చేసి పెట్టుబడులకు ఆహ్వానించిందని, తిరిగి పెట్టుబడుల సదస్సులో అవగాహన ఒప్పందాలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని నకిలీ ఓటర్లను జాబితాలో చేర్చారని ఆరోపించారు. నీటి ప్రాజెక్టుల అంశంలో మొండి వైఖరి ప్రదర్శించడం సరికాదన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దుకుంట వెంకటేశ్వర రెడ్డి, అనంతపురం పార్లమెంట్ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కేఎం .శ్రీనివాసులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాగిశెట్టి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కార్పొరేటర్



బొజ్జన్నకు సర్జికల్ చేతికర్రలను అందజేస్తున్న కార్పొరేటర్ మునిశేఖర్

అనంతపురం క్రైం: 49వ డివిజన్ కార్పొరేటర్ మునిశేఖర్ మానవత్వం చాటుకున్నారు. డివిజన్‌లోని ఇందిరాగాంధీనగర్‌లో నివాసముంటున్న కే బొజ్జన్న అనే వ్యక్తికి అనారోగ్యంతో వైద్యులు కాలు తొలగించారు. దీంతో నడవడానికి అవస్థలు పడేవాడు. నిరుపేద బొజ్జన్నకు బుధవారం కార్పొరేటర్ రెండు సర్జికల్ చేతికర్రలను అందించారు. బొజ్జన్న కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రచారం.. ముమ్మరం

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ముమ్మరం చేశారు. బుధవారం అనంతపురం నగరంలోని వివిధ డివిజన్లలో మేయర్ వసీం ఆధ్వర్యంలో కార్పొరేటర్లు ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులు వెన్నపూస రవీంద్ర రెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలన్నారు. నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నగరంలో అభివృద్ధి జరిగిన విషయాన్ని ఓటర్లకు తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గంలోనూ నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.

– అనంతపురం క్రైం/రాప్తాడు/ ఆత్మకూరు



ఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



37వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మేయర్ వసీం



ఓటు అభ్యర్థిస్తున్న మైనార్టీ విభాగం నాయకులు



ప్రచారం చేస్తున్న ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామల,అనిల్‌కుమార్ గౌడ్



రాప్తాడులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు